# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 105 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం 08, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన అభిమానులు స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ రేవంత్ రెడ్డి పుట్టిన రోజుకు స్పెషల్ గిఫ్ట్ ను ప్రజెంట్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్త్డే సందర్భంగా ఒడిశా సముద్ర తీరంలోని పూరీ బీచ్‌లో సైకత శిల్పాన్ని ఆవిష్కరించారు.

### రేవంత్.. మేఘా కృష్ణారెడ్డి మీద

## ఏసీబీ మీద కేసు పెట్టే దమ్ముందా?

- కేసు పెడితే పెట్టుకో. రెండు నెలలు జైల్లో ఉండి మంచిగా యోగా చేసుకొని ట్రిమ్‌గా వస్తా
- ఆ తర్వాత పాదయాత్ర చేస్తా
- 55 కోట్లు కట్టమని నేనే అర్వింద్ కుమార్ కి చెప్పా
- దీనికి కేబినెట్ అప్రూవల్ అవసరం లేదు
- హెచ్ఎండీఏ కు పూర్తిగా తెలుసు
- దీనిలో ఉచ్చు, బొచ్చు అనేది ఏముంది?
- రేవంత్ రెడ్డి గురువు చేయని పనిని మేము చేశాం
- కామన్వెల్త్ గేమ్స్ కోసం యూపీఏ ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ. 70 వేల 600 కోట్లు
- ఇదే క్రీడల్లో యూపీఏ ప్రభుత్వం మొత్తానికి భారీగా కుంభకోణం
- ఎఫ్ 1 రేసు కోసం నేను కూడా ఎంతో ప్రయత్నం చేశా
- ఎఫ్ 1 రేసు రాని కారణంగా మేము ఫార్ములా ఈ-రేస్ తెచ్చే ప్రయత్నం చేశాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,నవంబర్7(నమస్తే ఉదయం): మొట్ట మొదటి కారు రేస్ 1894లో పారిస్‌లో జరిగింది. ఫార్ములా వన్ రేస్ మొదటి రేసు 1946 లో ఇటలీలో జరిగింది. ఫార్ములా వన్ ఎంతో ఫేమస్ అయ్యింది. ఆ రేస్ నిర్వహించేందుకు దేశాలే పోటీ పడతాయి. దేశానికి ఫార్ములా వన్ రేసు రావాలన్న కల ఈనాటిది కాదు. రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు కూడా 2003 లో ఎఫ్1 రేసు హైదరాబాద్ లో నిర్వహించాలని ప్రయత్నం చేశారు.రేవంత్ రెడ్డి గురువు చేయని పనిని మేము చేశాం. అప్పట్లో ఎఫ్ 1 కోసం గోపన్ పల్లిలో 4 వందల ఎకరాల భూమి సేకరించి డెడికేటెడ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేశారు. అందుకు సంబంధించి భూ సేకరణపై కేసులో కోర్టులో నడుస్తోంది. యూపీ లో మాయావతి ప్రభుత్వం మొత్తానికి ఎఫ్ 1 రేసును నొయిడాలో జరిపారు.ఎఫ్ 1 రేసు కోసం 2011 లోనే దాదాపు 17 వందల కోట్లు ఖర్చు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో 1984 ఏషియన్ గేమ్స్, అదే విధంగా కామన్ వెల్త్ గేమ్స్ కూడా భారత్ లో జరిగాయి. కామన్వెల్త్ గేమ్స్ కోసం యూపీఏ ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ. 70 వేల 600 కోట్లు. ఇదే క్రీడల్లో యూపీఏ ప్రభుత్వం మొత్తానికి భారీగా కుంభకోణం చేసింది. ఏ ఇంటర్నేషనల్ ఈవెంట్లు జరిగిన సరే ప్రభుత్వం వాటికోసం ఖర్చు చేస్తోంది. అఫ్రో ఏషియన్ గేమ్స్ కోసం కూడా రూ. 103 కోట్లు ఖర్చు చేశారు. క్రీడల మిగతా..2లో

## నేడు యాదాద్రికి సీఎం రేవంత్

- పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు
- యాదాద్రి అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- వలిగొండ వద్ద మూసీపునరుజ్జీవ యాత్ర ప్రారంభం



హైదరాబాద్, నవంబర్7(నమస్తే ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును శుక్రవారం జరుపు కోనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు యాదాద్రి అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

## కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

- చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులకు సిఎస్ ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 7(నమస్తే ఉదయం): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషి చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. మిగతా..2లో



## రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు

- పుస్తకాన్ని ఆవిష్కరించిన పిసిసి చీఫ్

హైదరాబాద్,నవంబర్7(నమస్తే ఉదయం): సీఎం రేవంత్ రెడ్డిపై రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని తెలిపారు. మిగతా..2లో



### 2 లక్షల ఉద్యోగాలు

## భర్తీ చేస్తాం

- యూపీఎస్సీ మెయిన్స్‌కు ఎంపికైతే రూ. లక్ష ప్రోత్సాహం
- సివిల్స్‌కు ఎంపికైతే రాష్ట్రానికి ప్రయోజనం

హైదరాబాద్, నవంబర్7(నమస్తే ఉదయం): ఎన్నికల ముందు ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. హైదరాబాదులోని అశోక్ నగర్ లో గురువారం సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ ప్రారంభించి, ప్రసంగించారు. ఈ రాష్ట్రం కోరి కొట్లాడి తెచ్చుకున్నదే ఉద్యోగాల సాధన కోసం అని అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని తరహాలో ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు . ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామో ముందే తెలియజేస్తున్నామని ఆ పనిలో భాగంగా మిగతా..2లో

### అక్రమంగా పిజి మెడికల్

## సీట్లు విక్రయం

- మాజీమంత్రి మల్లారెడ్డికి ఇడి నోటీసులు

హైదరాబాద్,నవంబర్7(నమస్తే ఉదయం): పీజీ మెడికల్ కాలేజీ సీట్లు అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డికి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ రోజు జరిగే విచారణకు హాజరు కావాలని ఆయనకు





జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. దీంతో ఈడీ ఎదుట విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీకి ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పలు మెడికల్ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు విక్రయించారంటూ మిగతా..2లో

### బెంగళూరు చేరుకున్న

## హైడ్రా బృందం

- చెరువుల పునరుద్ధరణ తీరుపై అధ్యయనం
- వర్షాకాలంలో వరదల నివారణ చర్యలపైనా స్టడీ



హైదరాబాద్,నవంబర్7(నమస్తే ఉదయం): బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ తీరును హైడ్రా పరిశీలిస్తోంది. ఇక్కడ గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించారు. వీటిని పరిశీలించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరు చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఆయన నగరంలో చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు బుధవారమే బెంగళూరు వెళ్లగా.. రంగనాథ్ గురువారం అక్కడికి చేరుకున్నారు. చెరువుల పనరుద్ధరణతో పాటు విపత్తు నిర్వహణపై వారు అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు తమ పర్యటనలో యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచరల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించనున్నారు. అక్కడి సీనియర్ శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణపై సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్ల సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో లేక్ మ్యాన్ మిగతా..2లో

## నిబంధనలు మార్చలేం

- ఉద్యోగ నియామకాల ఎంపిక ప్రక్రియ
- మధ్యలో నిబంధనలు మార్చరాదు
- సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ,నవంబర్7(నమస్తే ఉదయం): సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చలేమని కోర్టు పేర్కొంది. పోస్టుల ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత నియమాలను మధ్యలో మార్చలేమని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ కేసు రాజస్థాన్ హైకోర్టులో ఓ ప్రభుత్వ పోస్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పుల చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మిగతా..2లో




### హామీల అమల్లో

## చతికిలపడ్డ కాంగ్రెస్?!

- తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్7(నమస్తే ఉదయం): బీఆర్ఎస్ దోపిడీ విధానాన్ని ప్రజలు అరికట్టి, కాంగ్రెస్ కు పట్టం కట్టబెడితే అధికారంలోకి వచ్చి యేడాది కాలం గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క గ్యారంటీని, హామీని నిలబెట్టుకోలేక చతికిలపడిందని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రల్లో ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదన్నారు. అప్పు పుట్టడం లేదన్నారు. ఆ రాష్ట్రల్లో కూడా మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు చుక్కలు చూపెడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పొయ్యి మీద నుంచి పెనంపై పడ్డట్టు తెలంగాణ ప్రజల పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు, ఉద్యమాలకు బీజేపీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే మిగతా..2లో

## భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?

- అరాచకాలు బయటపడుతుంటే భయం పట్టుకుంది
- చట్టం తనపని తాను చేసుకు పోతుంది
- రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం
- తొర్రూరు మార్కెట్ కమిటీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

మహబూబాబాద్,నవంబర్7(నమస్తే ఉదయం): 'గుమ్మడి కాయల దొంగ అంటే.. భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు.. పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు' అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్



కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ.. 'తల తాకట్టు పెట్టయిన డిసెంబర్‌లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. 'రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైర్ కింద పెడతావో ఆలోచించుకో' అని అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని అన్నారు. కానీ తడిగుడ్డతో గొంతు కోశారని మిగతా..2లో

## 2 లక్షల ఉద్యోగాలు

# భర్తీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే గ్రూప్ -1 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ -2 పరీక్షలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో విజయ వంతంగా ఉద్యోగాల భర్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమేధస్సు ఉన్నప్పటికీ నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతో యూపీఎస్సీ పరీక్షలను సాధించడంలో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రం నుంచి మెయిన్స్ కు ఎంపికైన వారికి ఇంధన శాఖ పక్షాన ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహంగా అందించినట్టు తెలిపారు. మెయిన్స్‌కు అర్హత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్, ప్రత్యేక శిక్షణ వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు వివరించారు. సివిల్ సర్వీస్ కు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఎంపిక అయితే మన ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు రావలసిన అవసరం ఉందన్నారు.

# రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒకే ఒక్కడు పుస్తక ఆవిష్కరణ చేసుకున్నామని తెలిపారు. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి, విజయార్కేకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని .. ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా.. రేపు (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

# కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్యపర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటిని కూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

## బెంగళూరు చేరుకున్న

# హైడ్రా బృందం

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో రంగనాథ్ సమావేశం కానున్నారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఐదు చెరువులను పునరుద్ధరించాలని ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది. కర్ణాటక ప్రభుత్వంతో పాటు సీఎస్ఆర్ కింద కొన్ని కంపెనీలు అభివృద్ధి చేసిన చెరువులను మూడు రోజుల పాటు స్టడీ చేయనున్నారు. తక్కువ ఖర్చుతో కర్ణాటక ప్రభుత్వం బెంగుళూరు లో 35 చెరువులను అభివృద్ధి చేసింది. చెరువుల పరిరక్షణకు, తీసుకుంటున్న చర్యలపై.. హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్యటిస్తున్నారు. పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత సిటీలో మొదటి దశలో నాలుగు చెరువుల ప్రక్షాళనపై ఫోకస్ పెట్టనున్నారు. బాచుపల్లి ఎర్రగుంట చెరువు, మాదాపూర్ సున్నం చెరువు, కూకట్ పల్లి నల్ల చెరువు, రాజేంద్రనగర్ అప్ప చెరువులకు హైడ్రా పునరుజ్జీవం తేనుంది. బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్ర స్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, మురుగునీరు స్వచ్ఛంగా మార్చడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించిన విధానాలను పరిశీలించనుంది. అలాగే భారీ వర్షాలు పడినప్పుడల్లా హైదరాబాద్ మహానగరాన్ని వరద నీరు ముంచెత్తడం, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేం దుకు బెంగళూరు డిజాస్టర్ మేనేజ్మెంట్ నిపుణులతో హైడ్రా అధికారులు సమావేశం కానున్నట్లు సమాచారం.

# నిబంధనలు మార్చలేం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పును బెంచి సమర్థించింది. ఆ కేసు తీర్పు సరైనదని.. దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. 'ప్రభుత్వాలు నియామక ప్రక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాలి. చివరికి ఖాళీలను పూరించిన తర్వాత ఆ ప్రక్రియ ముగుస్తుంది. నిబంధనలు మార్చొచ్చని ముందుగానే చెబితే పర్వాలేదు. నియామక ప్రక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదు. కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందిపెట్టరాదు.' అని ధర్మాసనం పేర్కొంది.

## అక్రమంగా పిజి మెడికల్ సీట్లు విక్రయం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అందులోభాగంగా గతేడాది జూన్‌లో మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి నివాసం, మెడికల్ కాలేజీతోపాటు కార్యాలయాలపై ఈడీ సోదాలు నిర్వహించింది. అలాగే 12 మెడికల్ కాలేజీల్లో సైతం సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లను సైతం ఈడీ స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు.. ఈడీ తన సోదాల్లో గుర్తించింది. దాంతో దీనిపై వివరణ ఇవ్వాలంటూ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితోపాటు వివిధ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

# హామీల అమల్లో చతికిలపడ్డ కాంగ్రెస్?!

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక సభ్యులున్న పార్టీ బీజేపీయేనని తెలిపారు. ప్రతీ మూడేళ్ళకు ఒకమారు గ్రామస్థాయి నుంచి సంస్థాగత ఎన్నికలను నిర్వహించుకునే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. పదేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు చేసే పార్టీ బీజేపీ అన్నారు. తెలంగాణలో 31 లక్షల సభ్యత్వ సేకరణ పూర్తయిందన్నారు. 15వ తేదీ వరకు సభ్యత్వ సేకరణ చేపట్టాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో నిర్దేశించుకున్న సమయంలోపు లక్ష్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

### దేశంలో కుటుంబ పాలన

దేశంలో కుటుంబాల ఆధారంగా పార్టీలు నడుస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. జమ్మూకశ్మీర్ నుంచి మొదలు తమిళనాడు వరకూ కొడుకు, అల్లుడు, బిడ్డ ఇలాంటి విధానం కొనసాగుతోందన్నారు. ఈ విధానానికి బీజేపీ పూర్తి వ్యతిరేకమని ఇందుకు ప్రతీ ఒక్కరూ గర్వపడాలన్నారు.

### గ్యారంటీలపై చేతులెత్తేసిన కాంగ్రెస్

తెలంగాణలో బీఆర్ఎస్ అహంకార పూరితంగా పాలించిందని, దోపిడీ చేసిందని ప్రజలు భావించారని కిషన్ రెడ్డి అన్నారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాది గడిచినా ఒక్క రేషన్ కార్డు, పెన్షన్ రూ.4వేలు, గృహ నిర్మాణాలకు భూమిపూజ చేయలేదన్నారు. అప్పులు మాత్రం విపరీతంగా చేశారన్నారు. కేసీఆర్ హయాంలో రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేస్తే, కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏ భూములను తాకట్టు పెట్టి అప్పు తీసుకోవాలనే చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తరువాత బీజేపీ వైపు ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రజల



ఆకాంక్షల మేరకు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం బీజేపీ సంస్థాగత వ్యవస్థ ఉపిరిలాంటిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

### ప్రజల సమస్యపై నిలదీద్దాం..

గ్రామీణ, మండల, జిల్లా కమిటీలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవైపు సంస్థాగతంగా ముందుకు వెళుతూనే ప్రజల గ్యారంటీలు, హామీల వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, పోరాటలు, ఉద్యమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. రైతాంగ, బడుగ బలహీన, నిరుద్యోగ విద్యారంగ, మహిళలు, నిరుపేదల సమస్యలపై బీజేపీ తరపున ప్రజలకు అండగా నిలవాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ఒక్కరూపాయి భారం పడనీయని కేంద్రం

కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి సంబంధించి చివరి గింజ వరకూ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఎన్నివేల కోట్లయినా ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే ఇక్కడి ప్రభుత్వం మధ్యవర్తులు, మిల్లర్లు, దళారీలతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఒక్కరూపాయి కూడా భారం కేంద్రం పడనీయదన్నారు.

ప్రతీనయా పైసా లెక్కపెట్టి ఇస్తుందన్నారు. ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. సీఎం మాటలు కోటలు దాటుతాయే తప్ప పనులు మాత్రం కనిపించవన్నారు. తెలంగాణలో హామీలు అన్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. మహారాష్ట్రకు వెళ్లి చెప్పుకుంటోందని ఆరోపించారు.

### నాలుగేళ్లు ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం కావాలి

కాంగ్రెస్ పాలిత రాష్ట్రలన్నీ ఒకవైపు దివాళా తీసే పరిస్థితి ఉందన్నారు. జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయని విమర్శించారు. అప్పులు పుట్టే పరిస్థితులు లేవన్నారు. వీటన్నింటిపై బీజేపీ పోరాటం చేయాలని కిషర్ రెడ్డి పిలుపునిచ్చారు. సంస్థాగత సభ్యత్వం, క్రియాశీలక సభ్యత్వం, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ప్రతీఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నాలుగేళ్ళపాటు ప్రజల పక్షాన నిలిచి పోరాడదామన్నారు.

రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరాలంటే ప్రజల పక్షాన పోరాడాలని పార్టీని పటిష్ఠం చేయాలని అన్నారు. బీఆర్ఎస్ పైన విశ్వాసం లేదని తేలిపోయిందని, కాంగ్రెస్ పై ప్రజలకు ఆక్రోశం ఆగ్రహం ఉన్నాయని అన్నారు. ఈ పార్టీలను నిలదీయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# రేవంత్.. మేఘా కృష్ణారెడ్డి మీద, ఏసీబీ మీద కేసు పెట్టే దమ్ముందా?

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణ కోసం ప్రభుత్వాలు ఖర్చు చేయటమనేది సర్వసాధారణం. తమిళనాడు లో కూడా జరిగిన ఫార్ములా 4 అనే రేసు కోసం రూ. 42 కోట్లు ఖర్చు చేశారు.

ఎఫ్ 1 రేసు జరుగుతుంది కనుకే మొనాకో అనే చిన్న దేశం ప్రపంచం మొత్తానికి తెలిసింది. జమ్ము కశ్మీర్ లో మోటార్ రేసింగ్ జరిగితే అక్కడ కశ్మీర్ ను ప్రమోట్ చేస్తూ మోడీ ట్వీట్ చేశారు.రాహుల్ గాంధీ కి కూడా మోటార్ రేసింగ్ అనే అభిరుచి ఉంది. దాన్ని నేను అభినందిస్తున్నా. ఎఫ్ 1 రేసు కోసం నేను కూడా ఎంతో ప్రయత్నం చేశాను. కానీ ఇండియాకు వచ్చే ఇంట్రెస్ట్ లేదని వాళ్లు చెప్పారు.

భవిష్యత్ తరాలకు సంబంధించి ఎలక్ట్రిక్ వెహికిల్స్ ను ప్రోత్సహించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఫార్ములా రేసింగ్ లో కూడా ఎలక్ట్రిక్ వెహికిల్స్ తో చేసే రేసింగ్ ను ఫార్ములా ఈ-రేస్ అంటారు. ఎఫ్ 1 రేసు రాని కారణంగా మేము ఫార్ములా ఈ-రేస్ తెచ్చే ప్రయత్నం చేశాం. ఈ-రేస్ అనేది ప్రపంచంలోని అత్యంత గొప్ప నగరాల్లో జరుగుతోంది. ఈ నగరాల చోట హైదరాబాద్ ను చేర్చాలని మేము ఈ-రేస్ ను ఇక్కడికి తెచ్చే ప్రయత్నం చేశాం.

మేము ఈ-రేస్ తెచ్చేందుకు చేసి ప్రయత్నంలో సియోల్, జోహెన్నస్ బర్గ్ ను తలదన్ని మన హైదరాబాద్ కు ఈ-రేస్ ను తెటచ్చాం. ఫార్ములా రేసింగ్ ను మేము ఒక రేసింగ్ గా మాత్రమే చూడలేదు. ఎలక్ట్రిక్ కార్లను ప్రమోట్ చేయాలనుకున్నాం. ఎలక్ట్రిక్ వెహికిల్స్ కు మన హైదరాబాద్ ను అడ్డాగా మార్చాలని మేము ఈ-రేస్ ను ఒక అడుగుగా ప్రయత్నం చేశాం. గతంలో పెట్టిన జీనోమ్ వ్యాలీ ఇప్పుడు వ్యాక్సిన్ తయారీకి హైదరాబాద్ ను రాజధానిగా చేసింది.

అదే విధంగా ఈ-రేస్ తో ఎలక్ట్రిక్ వెహికిల్స్ కేంద్రం అంటే హైదరాబాద్ ను గుర్తు చేయాలని మేము అనుకున్నాం. మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా కూడా ఈ-రేస్ కు సంబంధించిన కమిటీ లో మెంబర్ గా చేశాం. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ పెంచేందుకు మన హైదరాబాద్ ను ఎలక్ట్రిక్ మ్యానుఫాక్చరింగ్ చేద్దామనుకున్నాం. గతంలో బీవైడీ అనే సంస్థ చైనా నుంచి వచ్చేది ఉండే. కానీ చైనాలో గొడవల కారణంగా రాలేదు.

మేము ఈ-రేస్ కు కోసం ప్రభుత్వం తరఫున చేసిన ఖర్చు కేవలం రూ. 40 కోట్లు మాత్రమే. కానీ హైదరాబాద్ కు వచ్చిన ప్రయోజనం రూ. 7 వందల కోట్లు అని నీల్సన్ అనే సంస్థ కూడా చెప్పింది. అదే కాకుండా అమర్ రాజా బ్యాటరీస్, హ్యుందాయ్ అనే సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. బ్యాటరీ వెహికిల్స్ రీ పర్పస్ చేసే విధంగా జీవో తెచ్చాం. మరో సంస్థ రూ. 12 వందల కోట్లు పెట్టుబడులు పెట్టింది.

ఫార్ములా ఈ-రేస్, మొబిలిటీ వీక్ అనే కార్యక్రమం ద్వారా దాదాపు రూ. 2, 500 కోట్లు పెట్టుబడులు తెచ్చాం. ఫార్ములా ఈ-రేస్ ద్వారా వచ్చే ఆదాయం కూడా క్రమంగా పెరుగుతూ ప్రాచుర్యం పెరుగుతోంది. ఈ-రేస్ ను రేస్ గా కాకుండా మొత్తంగా ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ యూనివర్సిటీ టెక్నాలజీని పెంపొందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం.

గతంలో మేము ఈ-రేస్ ను ప్రమోట్ చేసేందుకు ముంబై వెళితే అక్కడే కేంద్రమంత్రులు ఈ-రేస్ ను హైదరాబాద్ కు మీరు తీసుకెళ్లారు అంటూ ఓపెన్ గా అన్నారు. ఈ-రేస్ కారణంగా రూ. 7 వందల కోట్ల ప్రయోజనంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాం.

మొబిలిటీ వీక్ ద్వారా కూడా ఎన్నో సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. మేము నాలుగేళ్లు, త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నాం. నిర్వహణ సంస్థ, హెచ్ఎండీఏ, గ్రీన్ కో అనే మూడు సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం. ప్రభుత్వానికి లాభం వచ్చినప్పటికీ గ్రీన్ కో అనే సంస్థ మాత్రం తమకు లాభం రాలేదని పక్కకు తప్పుకుంది. గ్రీన్ కో అనే సంస్థ లాభం రాలేదని తప్పుకోవటంతో వాళ్లకు నాకు ఇచ్చిన పైసలు ఏముంటాయి?

గ్రీన్ కో సంస్థ వెళ్లిపోవటంతో ఈ-రేస్ పోకుండా ఉండేందుకు ఆ డబ్బులను మేము ఇద్దామని అర్వింద్ కి చెప్పాను. వాళ్లకు స్పాన్సర్లు దొరకకపోవటంతో ప్రమోటర్ దొరికే వరకు నేనే భరోసా ఉంటానని చెప్పాను. ప్రభుత్వం తరఫున ఆ డబ్బు ఇద్దామని చెప్పాను. హెచ్ఎండీఏకు తెలియకుండా మేము డబ్బులు ఇచ్చామని అంటున్నారు. కానీ హెచ్ఎండీఏ కు పూర్తిగా తెలుసు.

ఈ-రేస్ ను మేము ప్రభుత్వం తరఫున కార్యక్రమంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు రూ. 55 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో అర్వింద్ కుమార్ తప్పు ఏం లేదు. నేను ఈ మొత్తానికి బాధ్యత తీసుకుంటాను. పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పురపాలక శాఖలో ఇంటర్నల్ గా డబ్బు అడ్జస్ట్ మెంట్ చేసుకోవచ్చు.

హెచ్ఎండీఏ ఇండిపెండెంట్ బోర్డు. దానికి ఛైర్మన్ సీఎం, వైస్ ఛైర్మన్ పురపాలక శాఖ మంత్రి. మన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినకుండా రూ. 55 కోట్లు కట్టమని నేనే అర్వింద్ కుమార్ కి చెప్పాను. దీనికి కేబినెట్ అప్రూవల్ అవసరం లేదు. హెచ్ఎండీఏ స్వతంత్ర బోర్డు.

ఈ-రేస్ కారణంగా 49 దేశాల్లో హైదరాబాద్ పేరు తెలిసేలా చేశాం. ఎన్నో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేశాం. కూలగొట్టుడు, విధ్వంసం చేయటమే వాళ్లకు తెలిసిన పని. కానీ నిర్మాణం చేయటం వారికి తెలియదు. అందుకే సీఎంగా ఎన్నికైన వెంటనే ఆ ప్రాజెక్ట్, ఈ ప్రాజెక్ట్ రద్దు అంటూ ప్రకటనలు చేశారు.

నా మీద కోపంతో అందులో నాకేదో వచ్చిందనుకొని ఏమీ తెలుసుకోకుండా దాన్ని రద్దు చేశారు. హైదరాబాద్ ఈ-రేస్ ను రద్దు చేయటంతో జాగ్వార్, నిస్సాన్ లాంటి సంస్థల వాళ్లు సిగ్గుచేటు అన్నారు.రేవంత్ రెడ్డి దిక్కుమాలిన నిర్ణయంతో ప్రపంచం ముందు హైదరాబాద్ ఇజ్జత్ పోయింది. మనకు రూ. 700 కోట్లు లాస్ వచ్చింది.

కొందరు రాస్తున్నారు కేటీఆర్ చుట్టు ఉచ్చు అని. దీనిలో ఉచ్చు, బొచ్చు అనేది ఏముంది? నిజానికి హైదరాబాద్ లో ఈ-రేస్ రాకుండా మన నగరం ఇమేజ్ దెబ్బ తీసినందుకు ఆయనపైనే కేసు పెట్టాలి. ఏసీబీ ఫుల్ ఫామ్ రేవంత్ రెడ్డికి తెలుసా? అవినీతి జరిగితే ఏసీబీ ని వాడాలి. కానీ ఇక్కడ అవినీతి ఏముంది? నాకు వచ్చింది ఏముంది?

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినవద్దని నేను ప్రభుత్వ పరంగా ఈ కార్యక్రమాన్ని తీసుకొని రూ. 50 కోట్లు ఖర్చు చేశాను. ఈ రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఒలింపిక్స్ నిర్వహిస్తామంటాడు. ఒలింపిక్స్ నిర్వహణకు ఎంత ఖర్చు అవుతదా తెలుసా?

నిజానికి కేసు పెట్టాలంటే మేఘా కంపెనీ మీద పెట్టాలె. కృష్ణా రెడ్డి మీద ఏసీబీ మీద కేసు పెట్టే దమ్ముందా రేవంత్ రెడ్డి? రాఘవ కంపెనీ, మేఘా కంపెనీలకు కేకులు కేసినట్లు ఇచ్చిన పనులకు సంబంధించి కేసులు పెట్టాలె. రూ. 50 లక్షల బ్యాగుతో దొరికిన రేవంత్ రెడ్డి పై 8 ఏళ్లుగా ఎలాంటి చర్యలు లేవు. మేము బ్రాండ్ ఇమేజ్ ను క్రియేట్ చేస్తే నువ్వు బ్యాడ్ ఇమేజ్ చేస్తున్నావు.

విశ్వనగరం ఇమేజ్ లేకుండా చేస్తే పెట్టుబడులు వస్తాయా? కేసు పెడితే పెట్టు. హైదరాబాద్ ను అంతర్జాతీయంగా పేరు తెచ్చినందుకు పెడతావా? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా? బెంగళూరు కన్నా ఐటీ ఎగుమతులను పెంచినందుకా? ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించినందుకా? ఎందుకు కేసు పెడతావు/

నువ్వు ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసిన మేము నీ హామీలపై పోరాటం చేస్తూనే ఉంటాం.ఇవాళ ఓ పేపర్ లో టార్గెట్ కేటీఆర్ అని రాశారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై కదా వాళ్ల టార్గెట్ ఉండాల్సింది. కేసు పెడితే పెట్టుకో. రెండు నెలలు జైల్లో ఉండి మంచిగా యోగా చేసుకొని ట్రిమ్ గా వస్తా. ఆ తర్వాత పాదయాత్ర చేస్తా.

రేవంత్ రెడ్డి కనీసం తెలుసుకో. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తియ్యకు. ఈ సన్నాసి ఎవరు చెప్పినా సరే వినటం లేదు. ఏం చేసుకుంటావో చేసుకో. రోజుకో రకంగా ప్రచారం చేస్తున్నందుకే మొత్తంగా ఏం జరిగిందో నేనే ప్రజలకు చెబుతున్నా. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్ ను ఖతం చేయాలని రాజ్ భవన్ లో ప్రయత్నం చేశారు. అయినా సరే నేను దేనికైనా రెడీగా ఉన్నాను. ప్రజల తరఫున పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.

# భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నాలుగు గోడల మధ్య కాళ్లు పట్టుకొనే అవసరం లేదని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు 'పొంగులేటి హోం మంత్రా..? అలా ఎందుకు మాట్లాడుతున్నారు' అని అంటున్నారని, తాను క్యాబినెట్ మంత్రినని, అన్ని విషయాలూ మాట్లాడుతానని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అంటున్నారని, పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని పొంగులేటి ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్టు చేస్తారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు.

తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల 19 కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు.. ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం మీద బావ బావమరిది తప్పుడు ప్రచారు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యక్షంగా రైతుల కోసం ఇప్పటి వరకు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశాం.. మిగతా 12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బావ బావమరిది తల ఎక్కడ పుట్టుకుంట్టారో అప్పుడు చెప్తుతామని అన్నారు.

పేదల పక్షపాతి ప్రభుత్వం కాబట్టి రైతుబంధు కొంచెం ఆలస్యమవుతుందని మంత్రి అన్నారు. తాము ఇచ్చే స్మార్ట్ కార్డు ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకానికి అని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిలో విదేశాల సంస్థలకు ఇచ్చిన భూమిని మళ్ళీ తీసుకొస్తున్నాం.. దేశంలో ఎక్కడ లేనటువంటి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తప్పు చేస్తే పేదవాడి సొమ్మును కొల్లగొడితే పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

గుమ్మడికాయ దొంగ అంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నావో చెప్పాలన్నారు. నీవు ఎందుకు పాదయాత్ర చేస్తున్నావో ప్రజలకు చెప్పాలని తెలిపారు. మనిషిని మనిషిలా గౌరవించని మీరు.. పదవిపోయే సరికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చట్టానికి తెలుసు.. ఎప్పుడు, ఎక్కడ ఏమి జరగాలో తెలుసు.. త్వరలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రైతులకిచ్చిన మాటని తుచ తప్పకుండా చేస్తామన్నారు.

రైతన్నలకి, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల వరకు కొత్త పింఛన్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అన్ని పథకాలు ఇచ్చి తీరుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అలాగే ప్రభుత్వా విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీలు, బలరాం నాయక్, కడియం కావ్య పాల్గొన్నారు.

# ఫార్ములా ఇష్యూలో అసలు దోషీ రేవంతే

## రూ.800 కోట్ల నుంచి 900 కోట్లు రాకుండా అడ్డుకున్నాడు

### రేవంత్‌ను జైలుకు పంపాలి : టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే ఉదయం): ఫార్ములా ఈ రేసు విషయంలో అసలు దోషి రేవంత్ రెడ్డి అని, ప్రస్తుతం రాష్ట్రానికి మున్సిపల్ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డే.. రూ.50 కోట్లు నష్టపోవడానికి కారణమయ్యారని టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రానికి రావాల్సిన దాదాపు రూ. 800 కోట్ల నుంచి రూ.900 కోట్ల పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. కావున రేవంత్‌పై చర్యలు తీసుకొని జైలుకు పంపాలన్నారు.ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు ఆసక్తి చూపించేలా వారికి అవగాహన కల్పించే ఉద్దేశంతో నాడు ఫార్ములా ఈ రేస్ నిర్వహించడానికి మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఎంత కష్టపడ్డారో.. రెన్యూయెబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నేను దగ్గరుండి చూశాన్నారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థను ఒప్పించి, ప్రమోటర్లను తీసుకొచ్చి విజయవంతంగా ఈవెంట్ నిర్వహించారు. మొట్టమొదటి ఫార్ములా ఈ రేస్ ఎక్కడ జరిగింది అంటే.. హైదరాబాద్ లోనే అని భవిష్యత్ తరాలు కూడా



చెప్పుకుంటాయి. అంతేకాదు ఈ మొబిలిటీ వీక్ పేరుతో కార్యక్రమాలుచేపట్టి ఎలక్ట్రిక్ వాహనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అలాగే ఫార్ములా ఈ రేస్ నిర్వహణతో హైదరాబాద్‌కు గ్లోబల్ ఇమేజ్ వచ్చింది. అంతర్జాతీయ ప్రముఖులు, సినీ, క్రీడారంగా ప్రముఖులు హైదరాబాద్‌కు వచ్చి ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా ఫార్ములా ఈ రేస్ ను స్వాగతించారు. స్వయంగా ఆయన కుమారుడే ఈ రేస్ లో పాల్గొన్నారని పేర్కొన్నారు. 2023లో జరిగిన ఈవెంట్‌కు ప్రభుత్వం చేసిన ఖర్చు ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. దాదాపు రూ.700 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయన్నారు. ప్రభుత్వం స్వయంగా ఖర్చు పెట్టింది తక్కువే అయినా.. రాష్ట్రానికి జరిగిన లాభం మాత్రం చాలా ఎక్కువని స్పష్టం చేశారు. 2024లో కూడా రేస్ మన రాష్ట్రంలోనే జరగాలని, మరిన్ని పెట్టుబడులు వస్తాయని కేటీఆర్ భావించారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్, నవంబర్ 7(నమస్తే ఉదయం):** మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం నందిగామ మండలం నర్సప్ప గూడ గ్రామంలో అక్కమ్మ చెరువులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, డిస్టిక్ ఫిషరీస్ ఆఫీసర్ పూర్ణిమ ల తో కలిసి ఉచిత చేప పిల్లలను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని లక్ష్యంతో 100% రాయితీ పై చేప పిల్లల పంపిణీ చేస్తుందని. అలాగే మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావాలి కృష్ణ, నేతలు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్,జంగా నరసింహులు, కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు తెలియజేయాలి

### - మేయర్ మద్దిల శ్రీలత ప్రేమ్ గౌడ్

**బండ్లగూడ, నవంబర్ 7(నమస్తే ఉదయం):** మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే విధంగా ఉత్సవాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ గౌడ్ అన్నారు. గురువారం



వనభోజనంలో పాల్గొన్న బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ గౌడ్

స్థానిక మహిళలు మృగవాని లో ఏర్పాటు చేసిన కార్తీకమాస వన భోజనం కార్యక్రమంలో మేయర్ లతా ప్రేమ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీలత మాట్లాడుతూ... ప్రజాహితమే లక్ష్యంగా తాను ముందుకు వెళుతున్నానని ప్రజలు ఏ అంశంపై సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

## రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని కలిసిన అసోసియేషన్

**మల్కాజిగిరి, నవంబర్ 7(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్ల సమస్యలు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావుతో వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు గణపతి రెడ్డి సూచనలు సలహాలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరేశం, తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ కోశాధికారి విశ్వనాథ వెంకటరమణ వీరేశం తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కలిసిన తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు గణపత్ రెడ్డి, కమిటీ ప్రతినిధులు

## ఇంటింటి సర్వేకు ప్రజలు అధికారులకు సహకరించాలి

### - కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

**బండ్లగూడ, నవంబర్ 7(నమస్తే ఉదయం)ద:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి కార్యక్రమం లో ఇంటికి వచ్చే సిబ్బందికి ఇంటి యజమానులు వివరాలు అందజేసి సహకరించాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఏడవ వార్డు కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటింటికి సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్ ,బిల్ కలెక్టర్ ఇమ్రాన్, కాలనీవాసులు కిషోర్ రెడ్డి,శ్రీనివాస్,లక్ష్మీనారాయణ ఎమ్యూనిరేటర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీలో ఇంటింటికి సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పద్మావతి





## తుది మెరుగులు దిద్దుకుంటున్న ఆరాంఘర్ - జూపార్కు ఫ్లైఓవర్

**రూ.779 కోట్లతో నిర్మాణం**

**ఎస్ఆర్ డీపీలోని అత్యంత పొడువైన ఫ్లై ఓవర్ ..**

**ఓల్డ్ సిటీ నుంచి ఏయిర్ పోర్టు వరకు ట్రాఫిక్ కు చెక్..**

**9న సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం**

**జీహెచ్ఎంసీ సన్నాహాలు**

**రాజేంద్రనగర్,నవంబర్ 07(నమస్తే ఉదయం):** నిత్యం ట్రాఫిక్ సమస్యతో అల్లాడిపోయే ఓల్డ్ సిటీ నుంచి శంషాబాద్ ఏయిర్ పోర్టు రూట్లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం సమకూరనుంది. ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు ప్రతిపాదించిన ఫ్లై ఓవర్ తుది మెరుగులు దిద్దుకుంటుంది.గత కొద్ది కాలం క్రితం నిధుల లేమితో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ సర్కారు కృషితో పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ నెల 9 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు చేస్తుంది.

ముఖ్యంగా గ్రేటర్లో రవాణా వ్యవస్థను మెరుగు పరుచి సిగ్నల్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్గా భాద్య తలు స్వీకరించిన వెంటనే రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అసంపూర్తిగా ఉన్న పలు ఫ్లైఓవర్, ఆర్ ఓ బి పూర్తి కాకపోవడానికి గల కారణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కమిషనర్ ఇలంబర్తి ఇంజనీరింగ్ అధికారుల జాప్యం గల కారణాలు తెలుసుకుని అన్నిరకాల సమస్యలకు పరిష్కారాన్ని సమకూర్చారు.

ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు చేపట్టిన ప్రధాన ఈ ఫ్లైఓవర్ నగరంలో జీహెచ్ఎంసీ ఎస్ఆర్ డీపీ కింద నిర్మించిన ఫ్లై ఓవర్లలో అత్యంత పొడువైన ఫ్లై ఓవర్ గా వాహనదారులకు అందుబాటులోకి రానుంది.అంతే గాక,ఎస్ఆర్ డీపీ కింద అందుబాటులోకి రానున్న 23వ ఫ్లై ఓవర్ ఇదే కానుంది.దాదాపు రూ.779 కోట్లతో వ్యయంతో నిర్మించిన ఈ ఫ్లై ఓవర్ ఆరు లేన్లుగా అందుబాటులోకి రానుంది.





ఉత్తర భారతీయుల చట్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, గంగా దేవికి ఫలహారం అందజేస్తున్న మహిళలు

## చాత్ పూజ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్/బండ్లగూడ, నవంబర్ 7(నమస్తే ఉదయం):** ఉత్తర్ రాష్ట్ర ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్ర ప్రజలు కార్తీక మాసంలో నిర్వహించే పూజా వేడుకల్లో బండ్ల గూడ మున్సిపాలిటీలోని గంధం గూడ, రాజేంద్రనగర్ పత్తి కుంట వద్ద జరిగిన చాట్ పూజలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్ చాట్ పూజ విశిష్టతను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... ఉత్తర రాష్ట్ర ప్రజలు చేసుకునే అతి పవిత్రమైన చాట్ పూజలో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే ఆ సూర్యభగ వానున్ని ప్రార్థించడమే చాట్ పూజ ప్రత్యేకత అని తెలిపారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి: సీఐటీయూ డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(నమస్తే ఉదయం):** నవంబర్ నుంచి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం గద్వాల్ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ (అనుబంధం )జనరల్ బాడి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుండి మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ పేరుతో కార్మికులు విధులను నిర్వహిస్తున్నారని కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి ఏటువంటి ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. ఆధునిక కాలంలో కూడా తమ చేతులతో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీ చేస్తూన్నారని విమర్శించారు. అత్యున్నత న్యాయస్థానాలు సైతం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని చెప్పినప్పటికీ పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం లేదని, చెల్లించే వేతనాలను సైతం రెగ్యులర్ గా ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్లో పెడుతున్నారని విమర్శించారు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకుండా కార్మికులతో వెట్టి చేయిస్తున్నరని విమర్శించారు మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు, సబ్బులు నూనెలు వంటివి సక్రమంగా అందజేయకుండా వారి ఆరోగ్యాన్ని,



ప్రాణాలను సైతం పణంగా పెట్టి పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని, అటువంటి కార్మికుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి సరికాదని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పదవి విరమణ పొందిన తరువాత వారి వారసులను విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాలను కార్మిక వర్గం అర్థం చేసుకొని సంఘటితంగా పోరాడి సమస్యల పరిష్కరించుకోవాలని అన్నారు.

అనంతరం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా శివ,డి.రవి, కోశాధికారిగా మహేష్, ఉపాధ్యక్షులుగా దౌలమ్మ, రఘు, సహాయ కార్యదర్శిగా కే. రాజు ,టి. హనుమంతు, సభ్యులుగా పాండు,హరి శంకర్, వెంకటేష్, లలితా, లక్ష్మీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహా, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఘట్టన్న, కార్మికులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న మహాసంకల్ప కోటిలింగాల ప్రతిష్ట కార్యక్రమాలు

**కార్తీకమాసంలో జన్మ తరింప చేసే కోటిలింగాల ప్రతిష్ట పూజలు**

**కొత్తకోట, నవంబర్ 14(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం లో శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో భక్తులు కార్తీక మాస మహెూత్సవ ఉత్సవాలు భక్తశబ్దలతో జరుపుకుంటున్నారు. దాతల సహాయంతో నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కార్తీకమాసం పురస్కరించుకొని బుధవారం ఆరవరోజు కోటి లింగాల ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు తమస్వహస్తాలతో పదకొండువేల శివలింగాలు ప్రతిష్టించే అపూర్వ కార్యక్రమం దేవస్థానము వారిచే ఏర్పాటు చేయగా ఆదోని వీర శైవ అగమ పాఠశాల అధ్యాపకులు, అర్చకులు జగదీశ్వర స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో జరు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పగా భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో కోటిలింగాల ప్రతిష్టలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి, అనిల్ స్వామి,ఆలయ ధర్మకర్త రుమాళ్ళ మహేశ్వర్ భక్తులచే మొదట భక్తులచే రుద్రహెూమం చేయించి పూర్ణాహుతి సమర్పించి కూష్మాండ బలి మహామంగళహారతి సమర్పించి అనంతరం పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో భక్తిశ్రద్ధలతో అభిషేకం చేయించి భక్తుల స్వహస్తాలతో పదకొండు వేల శివలింగాలు ప్రతిష్ట చేయించారు. అనంతరం ప్రతిష్టలో పాల్గొన్న భక్తులందరికి ఆలయకమిటి వారు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి రుమాళ్ళ శేఖర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్, జగదీశ్వర్, రాజేష్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




ఎన్నికల పరిశీలన అధికారి అహ్మద్ నదీం సమావేశమైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## ఓటర్లు ఇబ్బందుల కొరకు కాకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజిగిరి, నవంబర్ 7(నమస్తే ఉదయం):** ఓటర్లు పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులు ఎదుర్కొనకుండ ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రణాళిక పై అధికారిక సమావేశంలో ఎలక్షన్ రోల్ పరిశీలకులు, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈ ఎఫ్ ఎస్ అహ్మద్ నదీం, జిల్లా కలెక్టర్ గౌతమ్ పాత్రో, మండల ఈ ఆర్ ఓ లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన సూచనలు సలహాలతో పాటు, కొన్ని సవరణలు సూచించారు.ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...
ఓటరు నమోదు కార్యక్రమం సక్రమంగా, పకట్బంధీగా నిర్వహించాలన్నారు.

ఒకే కుటుంబంలో బార్యా భర్తల ఓట్లు వేరు వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉండడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు.వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వారి వేతనం లేదా పారితోషికం అందక సదరు వ్యక్తులు ఇబ్బందిపడ్డారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఆశావర్కర్ల సేవలు వినియోగించు కొని సరైన సమయంలో వారికి పారితోషికం అందించాలన్నారు. జియో ట్యాగింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. నగరంలోని ఓటు హక్కు కలిగినవిద్యార్థులు ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు.అర్హత కలిగి ఉండి ఇంతవరకు ఓటరు నమోదు చేసుకొని దరిమిలా స్థానికునిగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఓటరు నమోదు చేసి ఓటు వేసే అవకాశం ఇవ్వాలన్నారు.

## అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం: కార్పొరేటర్ సంగీత

**రాజేంద్రనగర్, నవంబరు 7(నమస్తే ఉదయం):** అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళు తున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీశంకర్ అన్నారు.

గురువారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పాండురంగ నగర్ లో సిసి రోడ్డు అభివృద్ధి పనులు ఆమె ప్రారంభించారు. పాండురంగ నగర్ చిన్న శివాలయం సమీపంలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ బస్తీ ప్రజలతో కలిసి 20 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు అభివృద్ధి పనులు అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభించడం జరిగింది. ఈ



పాండురంగ నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి ఎం కొమరయ్య, లక్కన్ సింగ్ ,ఉమా భాయ్, ముఖేష్ బిరాదర్, విజయరావత్, రాహుల్, బాలకృష్ణ ,జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రవి బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర, నవంబర్ 7(నమస్తే ఉదయం):**
నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తానని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలం వర్నే గ్రామం వద్ద హై లెవెల్



బ్రిడ్జ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై బ్రిడ్జ్ ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం కోసం రైతుల వద్ద భూమిని తీసుకుని, వారికి ప్రత్యామ్నాయ భూమిని కేటాయించకపోవడం, రైతులు కోర్టుకు వెళ్లడంతో బ్రిడ్జి పనులు నిలిచిపోయిన విషయం తమ ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని...సంబంధిత రైతులతో తమ ప్రభుత్వం సామరస్యంగా మాట్లాడి, రైతులకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించి, కురుమూర్తి బ్రహ్మోత్సవాల లోపు భక్తులకు బ్రిడ్జ్ ను అందుబాటులో తీసుకురావాలన్న లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయించి, బ్రిడ్జ్ ను ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు.

## నర్కుడ మాజీ సర్పంచ్ వీరయ్యకు ఘనంగా నివాళులు..

**శంషాబాద్, నవంబర్ 7(నమస్తే ఉదయం):** శంషాబాద్ మండలంలోని నర్కుడ ఉమ్మడి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గూడెపు వీరయ్య ఐదవ వర్ధంతిని గురువారం నిర్వహించారు. నర్కుడ. చౌదర్‌గూడ. కవ్వగూడ గ్రామపంచాయతీలు నర్కుడ గ్రామంలో ఉన్న సమయంలో సర్పంచ్‌గా విధులు నిర్వహించిన గూడెపు వీరయ్య ఐదవ వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడెపు రాజేందర్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.







మేనేజ్‌లో జరిగిన వర్క్ షాప్‌లో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు, వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ శరవణన్ రాజ్

## వ్యవసాయ రంగంలో పురుషులతో సమానంగా మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

**రాజేంద్రనగర్, నవంబరు 7(నమస్తే ఉదయం):** వ్యవసాయ రంగంలో పురుషులతో సమానంగా మహిళా రైతులను, మహిళా వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు, శాస్త్రవేత్త లకు సమాన అవకాశాలు ఉండేలా కార్యచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్ఫోర్డ్ బ్లేడ్ అన్నారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ మేనేజ్మెంట్ (మేనేజ్) లో జరిగిన వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మేనేజ్, ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఇర్రి), ఇక్రిశాట్‌లు సంయుక్తంగా నిర్వహిస్తు న్నాయి. జెండర్ ఇంపాక్ట్ ప్లాట్ ఫారంల సహకారంతో లింగ ప్రతిస్పందనాత్మక వ్యవసాయ విస్తరణ, పరివర్తన, పద్ధతులు, విధానాలు, సంస్థలు అనే అంశాలపై మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో 10 దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయా దేశాలకు చెందిన విధాన రూపకర్తలు, పరిశోధకులు, అభ్యాసకులు, అభివృద్ధి భాగస్వాములతో సహా కీలకమైన వాటా దారుల మధ్య డైనమిక్ సంభాషణ ద్వారా మహిళా రైతులకు సాధికారత కల్పించడానికి వ్యవసాయ విస్తరణ సలహా సేవలు పంపిణీలో విప్లవాత్మక మార్పులు చేయడం ఈ వర్క్ షాప్ లక్ష్మ న్నారు. ప్రారంభ ఉపన్యాసంలో ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్ఫోర్డ్ బ్లేడ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో వ్యవ సాయ రంగంలో మహిళా రైతులకు, వ్యవసాయ మహిళా పారిశ్రామిక వేతలకు క్రియాశీల కంగా మద్దతునిచ్చి ప్రోత్సహించే విధానాలు, పద్ధతులు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. మేనేజ్ ఇంచ ర్జీ డైరెక్టర్ జనరల్, అడ్మినిస్ట్రేషన్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ శరవణన్ రాజ్ మాట్లాడుతూ...

వ్యవసాయ విస్తరణ సంస్థల ద్వారా స్థానికంగా ఉండే నిపుణులను శక్తివంతం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వ్యవ సాయ పరిజ్ఞానాన్ని అన్ని సంస్థలలో పనిచేసే మహిళా రైతులకు, శాస్త్రవేత్తలకు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు.

ఇర్రీకి చెందిన డాక్టర్ రంజిత పుష్కర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో పురుష



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ స్టాన్ ఫోర్డ్ బ్లేడ్

లతో సమానంగా మహిళలను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌కు చెందిన డాక్టర్ వినీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పెళ్లి కేసులో యువకుడు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా

### ఊర్లోకి రానివడం లేదంటూ...

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(నమస్తే ఉదయం):** ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి గ్రామానికి చెందిన కొందరు సొంత ఊర్లోకి రానివ్వడం లేదని, తన భార్యను తన నుంచి దూరం చేసిన ధరూర్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆరోపణలు చేస్తూ... గురువారం ధరూర్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు చేస్తున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాలకు వెళ్లితే.... ధరూర్ మండలం జాంపల్లి గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తి కొన్ని నెలల క్రితం అదే గ్రామానికి చెందిన శృతి అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అమ్మాయి తరపు తల్లిదండ్రులు ధరూర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టడంతో ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షుకూర్ విచారణ పేరుతో అమ్మాయిని తన నుంచి దూరం చేసారంటూ బాదితుడు వీరేష్ పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రేమ పెళ్లి చేసుకునందుకు తనను ఊర్లోకి రానివకుండా బెదిరిస్తుండటంతో భయంతో గద్వాలలో తల దాచుకున్నట్లు బాధితుడు వెల్లడించారు. దీపావళి పండుగ రోజు అమ్మాయి కుటుంబ సభ్యులు తమ కుటుంబ సభ్యులపై దాడి చేశారని,ధరూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు న్యాయం చేస్తలేరంటూ... బాధితుడు తమ ఆవేధనను సోషల్ మీడియా ద్వారా వెల్లిబుచ్చారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్యను తన నుంచి దూరం చేయడమే కాకుండా ఊర్లోకి రానివ్వకుండా చంపుతామని కొందరు బెదిరిస్తున్నారని, దీనిపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని అమ్మాయి కుటుంబ సభ్యులను పలుమార్లు దాడి చేయడంతో పోలీసులను ఆశ్ర యించిన పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారని బాధితుడు ఆరోపించారు. తనకు న్యాయం జరిగేంత వరకు ధరూర్ పోలీస్ స్టేషన్ ముందే కూర్చుంటానని బాధితుడు తెలిపారు.

దీనిపై ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షుకూర్‌ను వివరణ కోరగా.... అమ్మాయి తప్పిపోయిందంటూ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా... అమ్మాయిని ట్రేస్ చేసి పట్టుకోవడం జరిగిందని, ఆ సమయంలో వీరేష్ పరారు అయ్యాడని, అమ్మాయిని తల్లి దండ్రులకు అప్పగించడం జరిగిం దన్నారు.

వీరేష్ కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు తమకు ఫిర్యాదు అందిందని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## పేదల దేవుడు శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి భక్తులకు శుభవార్త అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి

### శ్రీ కురుమూర్తి కొండ పైకి వెళ్లడానికి 110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్: ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర, నవంబర్ 7(నమస్తే ఉదయం):**
శ్రీ కురుమూర్తి స్వామి భక్తులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శుభవార్త తెలియజేశారు.శ్రీ కురుమూర్తి దేవస్థానం అభివృద్ధి పట్ల దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి మధుసూదన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

చిన్నచింతకుంట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన గుట్టపైకి వెళ్లేందుకు ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి ప్రభుత్వం 110 కోట్ల నిధులను దేవరకద్ర ఎమ్మెల్యే జి మధు సూదన్ రెడ్డి మంజూరు చేయించారు. ఈ మేరకు రోడ్డు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీ జీవోను ఎమ్మెల్యే జిఎంఆర్‌కు అందజేశారు. కురుమూర్తి దేవస్థానం వద్ద ఎలివేటేడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీయంఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణంతో కొత్త రూపు సంతరించుకొని కురుమూర్తి దేవస్థానం పర్యాటక కేంద్రంగా మారనున్నది. శరవేగంగా



శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానానికి నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

కురుమూర్తి దేవస్థాన పరిసరాలు అభివృద్ధి చెందనున్నాయి. కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద ఇటీవలే శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం 34 లక్షల రూపాయలతో మంజూరు చేయించి,



రోడ్డు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీ నుండి జీవో పత్రాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే జిఎంఆర్

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేడు కురుమూర్తి దేవస్థాన అభివృద్ధి కోసం, ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి 110 కోట్ల రూపాయలు ఎమ్మెల్యే జియంఆర్ మంజూరు చేయించారు.

ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేకత తీసుకొని కురుమూర్తి దేవస్థానం అభివృద్ధికి చేస్తున్న కృషి పట్ల నియోజకవర్గ ప్రజలు, స్వామి భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలి: కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(నమస్తే ఉదయం):**
జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను, అరికట్టేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కోసం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గట్టు, కేటిదొడ్డి, మల్దకల్ మండలాల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు గాను గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డ్రాప్ అవుట్ అయిన పిల్లలు తిరిగి పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు పోలీసు శాఖ కూడా పూర్తి సహకారం అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు బడి మానేసిన 945



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సంతోష్

పిల్లలను గుర్తించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి 800 మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించినట్లు తెలియజేశారు. రెస్క్యూ చేసిన బాల కార్మికులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలల్లో వెంటనే చేర్చుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి ప్రతిక్షణం అప్రమత్తం – సురక్షితం అనే కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి సీఈఓ కాంతమ్మ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, లేబర్ ఆఫీసర్ మహేష్ కుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రియాంక, బిసి ఎస్సి సంక్షేమ శాఖల అధికారులు రమేష్ బాబు, సరోజ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జయ భారతి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రవి, సిడిపిఓలు వైద్య, పోలీసు వివిధ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733